
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 21 । జూన్ । 2024





### వైభవం.. కల్యాణ మహోత్సవం

రేపల్లె రూరల్: ఇసుకపల్లిలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి.



### సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.40 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



### 'నేను బడికి పోతా' ర్యాలీ

కాకుమాను: స్థానిక ఎస్టీ కాలనీలో గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### రేపు కోటప్పకొండ గిరిప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కోటప్పకొండ గిరిప్రదక్షిణ సేవా సమితి అధ్యక్షులు అనుమోలు వెంకయ్యచౌదరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. ఘాట్‌రోడ్డు విజయగణపతి ఆలయం వద్ద అల్పాహారం, మార్గమధ్యంలో తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ పూర్తిచేసుకుని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

### వందేభారత్ రైలు ఆగేలా చర్యలు తీసుకోండి

డీఆర్‌ఎంను కలిసిన రైల్వే బోర్డు సభ్యుడు జూలకంటి శ్రీనివాసరావు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే బోర్డు సభ్యులు జూలకంటి శ్రీనివాసరావు కోరారు. డీఆర్‌ఎం ఎం.రామకృష్ణను గురువారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తున్న ఎల్‌టీటీ, డెల్టా, నర్సాపూర్, సికింద్రాబాద్ డెమో రైళ్లు ఆగక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని డీఆర్‌ఎంకు వివరించినట్లు ఆయన తెలియజేశారు.

### టమాటా ధరల నియంత్రణకు చర్యలు తీసుకోండి

జిల్లా అధికారులను ఆదేశించిన జేసీ శ్యాంప్రసాద్



నరసరావుపేట: చిత్తూరు జిల్లా పుంగనూరు, మదనపల్లె నుంచి టమాట కొనుగోలు చేసి జిల్లాలో వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయలు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో జిల్లా మార్కెటింగ్, వ్యవసాయం, పౌర సరఫరాలు, ఉద్యానవనం, ఏపీఎం ఐడీపీ, రైతు బజారు ఎస్టేటు అధికారులతో సమావేశం నిర్వహించి కూరగాయల ధరలపై సమీక్ష చేశారు. ధరల నియంత్రణ కోసం తగు సూచనలు జారీ చేశారు. ప్రైవేట్ మార్కెట్‌లో టమాటా ధరలు అత్యధికంగా ఉన్నందువలన పొరుగు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాలని సూచించారు. వ్యాపారస్తుల వద్ద నిత్యావసర కూరగాయలైన టమాట, ఉల్లిపాయలు మొదలైన నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ధరల స్థిరీకరణ జరిగేవరకు టమాటా కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అధికారులు ఐ.మురళి, ఆంజనేయులు, పద్మశ్రీ పాల్గొన్నారు.

### నేడు చాగంటి 'ప్రవచనామృతం'



తెనాలి: ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన తెనాలి పట్టణం మరొక విశిష్ట కార్యక్రమానికి వేదిక కానుంది. శ్రీరామనామము-శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ విశిష్టతపై ప్రవచనకర్త వాచస్పతి బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరావు శుక్రవారం 'ప్రవచనామృతం' నిర్వహించనున్నారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తనా బృందం, సంకీర్తనా సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక సుల్తానాబాద్లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో తొలుత శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి విశేష అర్చనలు చేస్తారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది. అనంతరం సాయంత్రం 6.45 గంటలకు ప్రవచనామృం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ యార్డులోని సభాస్థలిలో గురువారం వారు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# ఆరోగ్య యోగం

నేటి పోటీ ప్రపంచంలో ఉదయం నిద్ర లేచినది మొదలు మళ్లీ నిద్రించే వరకూ తీరిక లేకుండా పనులు. దీంతో ఎక్కువ మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ యోగా వైపు దృష్టి సారిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగా విశిష్టతను తెలియజేసేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిపై సాక్షి కథనం.

- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ
- క్రమశిక్షణతో కూడిన జీవనం
- రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ
- పట్టణాలలో యోగ శిక్షణ శిబిరాలు



యోగాసనాలు సాధన చేస్తున్న అభ్యాసకులు

నరసరావుపేట ఈస్ట్/సత్తెనపల్లి : యోగ సాధన చేసే వారికి క్రమశిక్షణతో కూడిన జీవనం అలవడుతుంది. ప్రతి రోజూ తెల్లవారుజామున నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని దాదాపు గంటన్నరపాటు ఆసనాలను వేయటంతో దినచర్య ప్రారంభమవుతుంది. నేటి ఆధునిక జీవితంలో చాలా మందికి శారీరక శ్రమ లేకపోవటం, ఉద్యోగాల రీత్యా సీట్లకే పరిమితం కావటంతో ఊబకాయంతో అల్లాడుతున్నారు. దీనికితోడు ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్, కల్తీ ఆహారంతో రోగాల పాలవుతూ, సంపాదించింది అంతా ఆసుపత్రుల బిల్లులకే ఖర్చు చేస్తున్నారు. ఎటువంటి ఖర్చు లేని యోగాసనాలను ప్రతిరోజూ గంటపాటు సాధన చేయటం ద్వారా రోజంతా ఉల్లాసంగా ఉండడంతోపాటు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.

### దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ..

యోగాతో రోగాల బారిన పడకుండా ఉండటంతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఆస్తమా, సయాటికా, గుండె జబ్బులు, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, స్థూలకాయం వంటి అనేక రోగాలు, సమస్యలను యోగాతో నివారించవచ్చని యోగా గురువులు స్పష్టం చేస్తున్నారు. నిత్యం యోగాసనాలు, ప్రాణాయామం సాధన చేస్తూ ఆహార నియమాలను పాటించేవారు జీవిత కాలం ఆరోగ్యంగా ఉంటారని చెబుతున్నారు.

### నరసరావుపేటలో నిత్య యోగా శిబిరాలు

ఆరోగ్య ప్రదాయినీ, శారీరక, మానసిక ప్రశాంతతనిచ్చే యోగాను ప్రతి ఒక్కరికి అందించేందుకు పట్టణంలోని యోగా సేవా కేంద్రాలు కృషి చేస్తున్నాయి. నరసరావుపేటలోని శ్రీ వేంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఈ ఏడాది రజతోత్సవం జరుపుకోనుంది. 2001 సంవత్సరంలో అప్పటి శ్రీ పట్టాభి రామస్వామి ఆలయ ధర్మకర్త నాగసరపు రామారావు ఆశీస్సులతో యోగ కేంద్రాన్ని ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా యోగ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిబిరంలో శిక్షణ పొంది అనంతరం కఠోర సాధనతో కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ ప్రస్తుతం యోగ గురూజీగా వేలాదిమందికి యోగాను పరిచయం చేశారు. ఉప బోధనాచార్యుడిగా జల్లి శ్రీనివాసరావు 20 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారు. ప్రకాష్‌నగర్‌లోని సాయిషా యోగ సేవా కేంద్రం కొన్నేళ్లుగా వందలాది మందికి యోగ శిక్షణ అందించింది. కేంద్రం నిర్వాహకురాలు వై.రాజ్యలక్ష్మి వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు. యోగలో మాస్టర్ డిగ్రీ చేసి 2017 సంవత్సరంలో తన గృహంలోనే యోగా సెంటర్‌ను స్థాపించి ఎందరికో యోగాను పరిచయం చేశారు. కోవిడ్ సమయంలోనూ ఆన్‌లైన్ ద్వారా యోగ శిక్షణ అందించారు. ఆన్‌లైన్‌లో అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలలోని ప్రవాసాంధ్రులతో పాటు పలు రాష్ట్రాలలో నివాసముంటున్న వారికి యోగ శిక్షణ అందిస్తున్నారు.





మయూర ఆసనంలో ఉప బోధనాచార్యుడు శ్రీనివాసరావు, హలాసనం

### ప్రతి ఆసనం ఉపయోగమే

యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని అందరూ విశ్వసిస్తున్నారు. యోగాభ్యాసంలో భాగంగా సాగే ఒక్కో ఆసనం ద్వారా ఒక్కొక్క ఉపయోగం ఉంటుంది. పూర్ణ ధనురాసన్, చక్రాసన్, వృక్షాసన్, హలాసన్, జాను శీర్షాసన్, పశ్చిమోత్తాసన్, వృష్టాసన్, శలభసన్, వృశ్చికాసన్, మాతృగర్భాసన్, సర్వాంగాసన్, శీర్షాసన్ వంటి వాటి వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటారు. బీపీ, షుగర్ సమస్యలకు నివారిణిగా ధ్యానం, యోగ పనిచేస్తుంది. ధ్యానంతో మనోవికాసం, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, అలసట లాంటి వాటిని దూరం చేసుకోవాలంటే యోగ తప్పనిసరి అని శాస్త్రీయంగా నిరూపితమైంది.



శీర్షాసనం

### సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో తొమ్మిదేళ్లగా సత్తెనపల్లిలో యోగాపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నా. యోగా వల్ల లాభాలను తెలుసుకొని అందరూ నేర్చుకోవడానికి ముందుకు వస్తున్నారు. ఆరోగ్యం పాడైన తర్వాత యోగ నేర్చుకునే కంటే ముందు నుంచి సాధన చేయడం ఎంతో మంచిది.

–పీఎం రమేష్,
యోగా గురువు, సత్తెనపల్లి

### బ్యాక్ పెయిన్ ఇబ్బంది పెట్టేది



నేను రిలయన్స్ జియో లిమిటెడ్‌లో కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నా. వృత్తి రీత్యా నిత్యం 100 నుంచి 150 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తా. దీంతో బ్యాక్ పెయిన్ సమస్య వచ్చింది. ఎంతో ఇబ్బంది పడేవాడిని. 2021 నుంచి యోగా చేయడం వల్ల బ్యాక్ పెయిన్ నుంచి ఉపశమనం పొందా. రోజంతా ఉత్సాహంగా ఉంటున్నా. వివిధ రకాల ఆసనాలు, ప్రాణాయామం వంటివి సాధన చేస్తున్నా.

–ముసులూరి సునీల్ కుమార్,
కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్, సత్తెనపల్లి

### ఆసనాలు నెమ్మదిగా వేయాలి..



మనసుని ప్రశాంతంగా ఉంచుకొని నెమ్మదిగా ఆసనాలు వేయాలి. వేగంగా ఆసనాలను వేయటం వలన ఫలితం ఉండదు. శ్వాస మీద ధ్యాస పెట్టాలి. గాలిని లోపలికి పీల్చుతూ బయటకు వదలటంపై అదుపు ఉండాలి. ప్రాణాయామంతో యోగాను ఆరంభించాలి. ఆహారం తీసుకున్న తర్వాత యోగ చేయరాదు. యోగ గురువుల వద్ద శిక్షణ పొంది నిరంతర అభ్యాసం చేయాలి. అనారోగ్యంతో ఉన్నవారు యోగాసనాలు వేయరాదు.

– కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ,
యోగ గురూజీ

### హై బీపీ నుంచి ఉపశమనం



నేను గృహిణిని. ఇంటి వద్దే ఉంటాను. నాకు హై బీపీ కారణంగా మానసికంగా ఆందోళన ఉంటుంది. వైద్యులను సంప్రదించినప్పటికి నయం కాలేదు. ఈ క్రమంలో నాలుగు సంవత్సరాలుగా యోగా శిక్షణ తరగతులకు నిత్యం హాజరవుతున్నా. యోగ చేయడం వల్లన హైబీపీ నా నుంచి దూరమై ఉపశమనం పొందా. మానసికంగా ప్రశాంతంగా ఉంటుంది. వైద్యులను సంప్రదిస్తే యోగాను కొనసాగించమని చెప్పారు.

–గంగారపు శివమ్మ, గృహిణి, సత్తెనపల్లి

### ఆరోగ్య ప్రదాయిని యోగా



మానసిక, శారీరక ఆరోగ్యానికి మన పూర్వీకులు మనకిచ్చిన అద్భుత వరం యోగ. మానసిక ఒత్తిడితో సంక్రమిస్తున్న దాదాపు 60 రకాల రోగాలను యోగా ద్వారా దూరం చేయవచ్చు. 90 శాతం రోగాలు చిరాకు, ద్వేషం, ఈర్ష్య, కోపం, అసూయ వల్లనే వస్తాయి. యోగాసనాల ద్వారా ఇవన్నీ తొలగిపోయి ప్రశాంతత కలుగుతుంది. శరీరంలోని 72 వేల నాడులు ఉత్తేజితమై రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.

– వై.రాజ్యలక్ష్మి,
యోగా గురువు, సాయిషా యోగ సెంటర్

### సైనస్ సమస్య నుంచి విముక్తి



నేను సైనస్‌తో చాలా ఇబ్బందులు పడ్డా. ఈ సమస్య నుంచి బయట పడేందుకు అనేక మంది వైద్యులను సంప్రదించా. మందులతో తాత్కాలిక ఉపశమనం తప్ప పూర్తిస్థాయిలో నయం కాలేదు. యోగా సాధన చేయడం వల్లన సైనస్ సమస్య నుంచి విముక్తి లభించింది. శారీరకంగా, మానసికంగా ఎలాంటి అలసట లేకుండా ప్రశాంతంగా ఉండగలుగుతున్నా.

–కె.వెంకట గరటాచలం,
బంగారు వ్యాపారి, సత్తెనపల్లి

### ఆసనాలతో ఆరోగ్యం



నేను గృహిణిని. అలసట, ఆందోళనగా ఉండేది. యోగ చేయడం వల్లన నాకు తెలియకుండానే వ్యాధుల నుంచి ఉపశమనం కలిగింది. ఇప్పుడు నాకు ఎలాంటి అలసట, ఆందోళన లేదు. ఉత్సాహంగా ఉంటున్నా. క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తున్నా.

–కూనాగు.ఉషా,
గృహిణి, సత్తెనపల్లి

# పెరుగుతున్న పట్టణీకరణ

- ఏటా వృద్ధి చెందుతున్న పట్టణ జనాభా
- 2001 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టణ జనాభా 12,85,580 మంది
- 2011 జనాభా లెక్కల ప్రకారం 16,52,738కి పెరుగుదల
- ఈ పదేళ్లలో జిల్లా జనాభాలో 8.64 శాతం పెరుగుదల
- పట్టణ జనాభాలో మాత్రం ఏకంగా 29 శాతం నమోదు
- ఉపాధి, విద్య, వైద్య సదుపాయాల కోసం గ్రామాల నుంచి పెరుగుతున్న వలసలు



సాక్షి, నరసరావుపేట: పట్టణ జనాభా పెరుగుతూ పోతోంది. ఏటికేటికి వృద్ధి చెంది పట్టణాలు తమ సాంద్రతను పెంచుకొంటున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2001 నాటి పట్టణ జనాభాతో 2011 నాటి జనాభా పోల్చితే ఏకంగా 29 శాతం పట్టణ జనాభా పెరిగింది. 2001లో జిల్లాలోని 12 పట్టణాలలో 12,85,580 మంది నివసిస్తుండగా, 2011 నాటికి జిల్లాలోని 13 పట్టణాల్లో జనాభా 16,52,738కి పెరిగింది. జిల్లా మొత్తం జనాభా 2001 జనాభా లెక్కల ప్రకారం 44,65,144 ఉండగా, 2011 నాటికి 48,87,813కి పెరిగింది. పదేళ్ల కాలంలో జిల్లా మొత్తం జనాభా 8.64 శాతం (4,22,669) పెరిగింది. అదే సమయంలో పట్టణ జనాభా మాత్రం ఏకంగా 29 శాతం (3,67,158) పెరగడం విశేషం. కరోనా కారణంగా 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు పట్టా లెక్కలేదు. జనగణన పూర్తయితే 2011 పోల్చితే పట్టణ జనాభా మరింత పెరిగే అవకాశం ఉందని ఎకనమిక్స్ విభాగం నిపుణులు భావిస్తున్నారు.

**విద్య, వైద్య, ఉపాధి సదుపాయాల కోసం...**

వ్యవసాయాధారిత జిల్లాలో సాగునీటి సౌకర్యం పెరగడంతో వాణిజ్య, ఉద్యాన పంటల సాగు పెరిగి రైతుల ఆదాయం పెరగడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఆర్థికంగా కొంత వెసులుబాటు రావడంతో విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లా నుంచి వేల సంఖ్యలో విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు పొందారు. ఇక్కడి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటంతో సౌకర్యాల కోసం పట్టణాలకు వలస వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పట్టణాల్లో విద్య, వైద్య, రవాణా సదుపాయాలతోపాటు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండటంతో పల్లె ప్రజలు పట్టణాలకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. గుంటూరు, నరసరావుపేటలు విద్యాకేంద్రాలుగా భాసిల్లుతుండటంతో వైద్యం, ఇంజినీరింగ్, వాణిజ్య, సాంకేతిక, ఫార్మా తదితర కళాశాలలు అందుబాటులోకి రావడంతో అందరికీ చదువుకునే వెసులుబాటు కలిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన వారు దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు విదేశాల్లోనూ అనేక అంశాల్లో రాణిస్తున్నారు. విదేశాలకు వెళ్లిన వారు పంపుతున్న సొమ్ముతో ఇక్కడి ప్రజల జీవనప్రమాణాలు మరింత మెరుగుపడ్డాయి. ఆర్థికంగా ఎదగడంతో ఇక్కడి ప్రజలు పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారు. దీంతో పట్టణాలలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఇవన్నీ కూడా పట్టణీకరణకు దోహదం చేశాయి. ఒకప్పుడు పంచాయతీలుగా ఉన్నవి నేడు మున్సిపల్ పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. పట్టణాల్లో ఏటికేడు జనాభా సంఖ్య పెరుగుతుండటం ప్రగతికి సూచికలుగా చెబుతున్నారు.

### పట్టణ జనాభా పెరుగుతోంది ఇలా...

| మున్సిపాలిటీ | 2001 జనాభా లెక్కలప్రకారం | 2011 జనాభా లెక్కల ప్రకారం | పెరుగుదల శాతం |
|---|---|---|---|
| గుంటూరు | 5,14,461 | 6,70,073 | 30 |
| నరసరావుపేట | 95,349 | 1,17,489 | 23 |
| తెనాలి | 1,53,576 | 1,64,937 | 7 |
| రేపల్లె | 42,539 | 50,866 | 20 |
| చిలకలూరిపేట | 91,656 | 1,01,398 | 11 |
| బాపట్ల | 68,397 | 70,777 | 3 |
| మంగళగిరి | 63,349 | 1,07,197 | 69 |
| పొన్నూరు | 57,640 | 59,913 | 4 |
| సత్తెనపల్లి | 51,404 | 56,721 | 10 |
| మాచర్ల | 49,221 | 57,290 | 16 |
| వినుకొండ | 52,519 | 62,550 | 19 |
| తాడేపల్లి | 45,469 | 70,424 | 55 |
| పిడుగురాళ్ల | --- | 63,103 | 100 |
| మొత్తం | 12,85,580 | 16,52,738 | 29 |

### మెరుగైన జీవనం కోసమే పట్టణాలకు వలసలు



పట్టణాల్లో మంచి వసతులు ఉంటున్నాయి. మెరుగైన విద్య, ఉపాధి, వైద్య అవకాశాలతోపాటు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పట్టణాల్లో సంస్కృతి మారుతోంది. దీంతో పల్లెల్లోని ప్రజలు దగ్గర్లోని పట్టణాలకు వలస వెళుతున్నారు. దీనితోపాటు పట్టణాలకు వస్తున్న వారిలో ఎక్కువగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలు అధికంగా ఉంటున్నాయి. వీరికి పల్లెల్లో పెద్దగా ఆస్తులేవీ ఉండవు. కాబట్టి తమ కుటుంబీకులకు మంచి విద్య, ఉపాధి అవకాశాలు, పెద్దలకు కావాల్సి ఆరోగ్య సంరక్షణ కోసం పట్టణాలకు వస్తున్నారు. ఎక్కువ మంది పట్టణాల్లోనే స్థిరపడిపోతున్నారు.


– నారే శ్రీహరి, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు, ఎస్ఎస్ఎన్ కళాశాల, నరసరావుపేట.

### పిల్లల చదువు.. ఉపాధి కోసం



పిల్లలకు మెరుగైన విద్య కోసం మా స్వగ్రామం కరాలపాడు నుంచి నరసరావుపేట వచ్చాం. పేటలో చికెన్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తూ ఉన్నాను. పిల్లలను చదివిస్తూనే ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉండటంతో నాలాంటి వారు గ్రామాలను వదలి పట్టణాలకు పెద్దఎత్తున వస్తున్నారు. పట్టణాల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటంతోపాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటున్నాయి.

–షేక్ గౌస్ ఆరిఫ్, కరాలపాడు, పిడుగురాళ్ల మండలం.



మంగళగిరి పట్టణం ఏరియల్‌వ్యూ

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సర్వీసెస్ కో ఆర్డినేటర్ రంగారావు
- వైద్యులు, సిబ్బందితో సమీక్ష



మాచర్ల: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సర్వీసెస్ కో ఆర్డినేటర్ రంగారావు హెచ్చరించారు. గురువారం మాచర్ల నియోజకవర్గంలోని విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. నాలుగు రోజుల కిందట గర్భిణికి సక్రమంగా డెలివరి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తల్లి, బిడ్డ మృతిచెందడం బాధాకరమన్నారు. లక్ష్యాల కోసం ఆపరేషన్‌లు చేయడం సరికాదన్నారు. డెలివరి ఇబ్బంది అనిపిస్తే మెరుగైన వైద్యశాలలకు రిఫర్ చేయాలన్నారు. ఇలాంటి విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విజయపురిసౌత్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేష్, ఆపరేషన్ నిర్వహించిన మహంతి, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అందరూ తీరు మార్చుకోవాలని సూచించారు. మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించారు. వైద్యులు, ఆయా విభాగాల వైద్య సిబ్బందితో సమీక్షించారు. నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణలు రాకూడదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింప చేసేలా మెరుగైన వైద్య సేవలు రోగులకు అందించాలన్నారు. సూపరింటెండెంట్ ఉదయభానుకు పలు సూచనలు చేశారు. సమావేశంలో సాయి, చార్లీ, మరియారాణి, విజయలక్ష్మి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 23న విద్యార్థులకు నగదు పురస్కారాలు

**తెనాలిఅర్బన్:** వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 23న ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు ఈఎల్‌వీ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,16,000 పురస్కారాలతో పాటు 125 మంది విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ, దుస్తులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని ముత్తెంశెట్టిపాలెంలోని పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

**మాచర్ల :**మండలంలోని గుండ్లపాడు గ్రామంలో ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తోట వెంకయ్య అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఇనుపరాడ్లతో రెండు కాళ్లపై దాడి చేయటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పాతకక్షల నేపథ్యంలో వెంకయ్యపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకొని వెంకయ్యను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు పేర్కొన్నారు.

### జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను తొలగించేందుకు ఉద్దేశించిన జీవో 117ను రద్దు చేస్తామని ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు. నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం సంఘ జిల్లా అధ్యక్షుడు గోవిందు వెలాంగిణిరాజు అధ్యక్షతన సంఘ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. చిరంజీవి మాట్లాడుతూ పాఠశాలల విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలపడం వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతుందని, తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మాట్లాడుతూ తల్లి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవిందు వెలాంగణిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టిబోయిన నరసింహారావు, రాష్ట్ర నాయకులు జి.విజయానంద్ పాల్గొన్నారు.

**జీవో రద్దుపై లోకేష్ హామీ నిలుపుకోవాలి**

ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీనంపై జారీ చేసిన జీవో 117ను రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. పెదబాబు, డీకే సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

- పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి
- రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణ పనుల పరిశీలన

**నాదెండ్ల:** సాతులూరు రైల్వేస్టేషన్ సమీపంలో జరుగుతున్న రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణ పనులను పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ మురళి గురువారం పరిశీలించారు. నరసరావుపేట జిల్లా కేంద్రంగా మారినందున ప్రస్తుతం ఈ రైల్వే గూడ్స్ షెడ్డును సాతులూరుకు తరలించి అక్కడ నిర్మాణ పనులు కొంతకాలంగా జరుగుతున్నాయి. సాధ్యమైనంత త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. షెడ్డు నిర్మాణం పూర్తయితే వివిధ కంపెనీల నుంచి రైతులకు అవసరమైన ఎరువులు స్టాక్ పాయింట్‌కు చేరి సకాలంలో ఆర్‌బీకేలకు సరఫరా అయ్యేలా వీలుంటుందన్నారు. ఆయనతోపాటూ ఏడీఏ రవికుమార్, ఏఓ హరిప్రసాద్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు ఉన్నారు.



ఆర్‌బికేను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న వ్యవసాయాధికారి మురళి, ఏడీఏ రవికుమార్

**ఆర్‌బీకే సందర్శన**

సాతులూరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి సందర్శించారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ చేసే విధానంపై సమీక్షించారు. ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి గుర్తింపు కార్డులు అందించాలని సూచించారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ నిత్యం సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధులకు సంబంధించి లబ్ధిదారుల్లో ఐదు శాతం మంది భౌతికంగా ధృవీకరించి వారి ఈకేవైసీని ఈనెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కౌలు రైతుల గుర్తింపు కార్డుల వలన సాధారణ రైతులకు ప్రభుత్వం నుండి అందే సబ్సిడీ పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతాయన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు.

# ప్రతి ఎకరాకు సాగునీరివ్వాలన్నదే లక్ష్యం

ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట:** ప్రతి ఎకరాకు సాగునీరివ్వాలి, ప్రతి రైతుకు ప్రభుత్వ సాయం అందాలన్నదే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ అతిథి గృహంలో ఎన్‌ఎస్పీ, వ్యవసాయాధికారులతో సమీక్షించారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రియల్టర్లు వందలాది ఎకరాల్లో పొలాలు, పంట కాలువలు, డొంక రోడ్లు, చెక్ డ్యాములు కబ్జా చేసి లే అవుట్లు వేస్తున్నారన్నారు. డాక్టర్ కొడుకు డాక్టర్, ఇంజినీర్ కొడుకు ఇంజినీర్ అయ్యేందుకు ఆసక్తి చూపుతున్న విధంగానే రైతు బిడ్డ రైతు అవుతానని కాలర్ ఎగరేసి చెప్పే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. రైతుల పొలాలు ఆక్రమణకు గురవ్వడంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన సదుపాయాలు అందకుండా పోతున్నాయని పేర్కొన్నారు. వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో అనుసరిస్తున్న విధానాలను కూడా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతు ప్రభుత్వాలపై ఆధారపడే పరిస్థితి పోవాలని, ప్రభుత్వమే రైతులపై ఆధారపడే పరిస్థితి రావాలన్నారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి మస్తానమ్మ, ఎన్‌ఎస్పీ డీఇ రామారావు, నాయకులు వేల్పుల సింహాద్రియాదవ్, పులిమి రామిరెడ్డి, దేశిరెడ్డి చిన్నపరెడ్డి, రామారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ అతిథి గృహంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

# గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

**నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):** సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ కమిటీ అధ్యక్షులు రావుల మణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌ను గౌడ సంఘ ప్రతినిధులు కలిసి అభినందించడంతోపాటు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గీత కార్మికులకు గీత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గాలి సుబ్బారావు, మొరాకుల రాము, నరేంద్ర, వెంకటరమణ, ప్రసాద్, రమణ, గౌడ సంఘీయులు పాల్గొన్నారు.



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

# డీ.ఫార్మసీలో ప్రవేశం కోసం దరఖాస్తుకు గడువు పొడిగింపు

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో రెండేళ్ల కాల పరిమితి గల డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును సాంకేతిక విద్యాశాఖ ఈనెల 27 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ రెగ్యులర్‌తోపాటు దూరవిద్య ద్వారా బైపీసీ, ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థినులు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ బోర్డు నుంచి తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆదాయ ధ్రువీకరణపత్రం/తెల్లరేషన్ కార్డు కలిగిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా అడ్మిషన్ ఫీజు మినహాయింపుతోపాటు ఉపకార వేతనాలకు అవకాశం కలదని తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి కలదని, ఆసక్తి గల విద్యార్థినులు అన్ని సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, దరఖాస్తు రుసుం రూ.400తో కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 98480 38769, 99593 24563, 93986 20953 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### గంజాయి కేసులో ఏడుగురు అరెస్ట్

**తెనాలిరూరల్:** గంజాయి కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్ కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం చవటపల్లికు చెందిన అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్ అలియాస్ మణి, మచిలీపట్నానికి చెందిన దాసరి శ్రీసాయిశంకర్ భవాని, పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన రామిశెట్టి శ్యాంవెంకట్ అలియాస్ బబ్లు ముగ్గురు గంజాయికి అలవాటు పడ్డారు. ఒడిశా నుండి తక్కువ ధరకు గంజాయిని తీసుకువచ్చి విక్రయించడం మొదలు పెట్టారు. వీరి వద్ద విజయవాడ తాడిగడపకు చెందిన ఉయ్యూరు కౌశిక్ రెడ్డి, తెనాలి నందులపేటకు చెందిన కోటి సాయిమంజునాథ్, పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన అమ్మిశెట్టి మణికంఠ, తెనాలి నందులపేటకు చెందిన దేవిశెట్టి బసవేశ్వరరావు గంజాయి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో తెనాలి వీఎస్సార్ కళాశాల సమీపంలో బుధవారం సాయంత్రం ఏడుగురూ అనుమానాస్పదంగా తిరుగుతున్నారని సమాచారం రావడంతో సీఐ సుధాకర్ తన సిబ్బందితో ఆకస్మిక దాడులు చేశారు. ఏడుగురినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ తెలిపారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

**నరసరావుపేట ఈస్ట్:** పల్నాడురోడ్డులోని ఎస్‌బీటీ అండ్ ఎస్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో బీఏ– పొలిటికల్ సైన్స్, బీకామ్–కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ–జువాలజీ, బీఎస్సీ– కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ– మ్యాథమెటిక్స్ కోర్సులు ఉన్నాయని వివరించారు. ఇంటర్మీడియేట్‌లో ఉత్తీర్ణత సాధించి డిగ్రీలో చేరేందుకు వచ్చే విద్యార్థులు తమ వెంట ఇంటర్మీడియేట్ సంబంధిత సర్టిఫికెట్లు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులకు సహాయపడేందుకు కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

# గుంటూరు రైల్వే డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి



డీఆర్‌యూసీసీ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

- డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌యూసీసీ సమావేశం
- హాజరైన డీఆర్‌యూసీసీ చైర్మన్ రామకృష్ణ
- పలు కీలక అంశాలపై చర్చ

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో మూడో డివిజనల్ రైల్వే వినియోగదారుల కన్సల్టేటివ్ కమిటీ సమావేశం (డీఆర్‌యూసీసీ) నిర్వహించడం సంతోషంగా ఉందని డీఆర్‌యూసీసీ చైర్మన్, డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో గురువారం డీఆర్‌యూసీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్టేషన్లలో కోచ్ ఇండికేషన్ బోర్డుల మెరుగుదల, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, కొన్ని రైళ్ల నిలిపిత, రైళ్ల సమయాల మార్పులు, ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని కొన్ని సమస్యల పరిష్కారంపై హెడ్ క్వార్టర్స్ పరిశీలనకు సిఫార్సు చేయాలని నిర్ణయించారు. కొత్త గతి శక్తి టెర్మినల్స్ వచ్చాయని, డివిజన్‌లో మరి కొన్ని జీసీటీలు రానున్నాయని రామకృష్ణ పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, డీసీఎం కో–ఆర్డినేషన్ సి.హెచ్.ప్రదీప్, సీనియర్ డీఓఎం దినేష్ కుమార్, సీనియర్ డీఈఎన్ జె.వి.అనూష, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ, మెయింటెనెన్స్ డీసీఎం భారత్, సుదర్శన్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లల దత్తత కోసం సంప్రదించాలి

- శిశుగృహాలో ఉండే పిల్లలను న్యాయపరంగా దత్తత ఇస్తాం
- ఐసీడీఎస్ పీడీ కె.ఉమారాణి

**నరసరావుపేట:** జిల్లాలో నిర్వహిస్తున్న శిశు గృహాలో ఉన్న అనాథ పిల్లల దత్తత కోసం పిల్లలు లేని తల్లిదండ్రులు సంప్రదించాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు, సంక్షేమ సాధికారిత అధికారి కె.ఉమారాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహాలో అప్పుడే పుట్టిన పసికందుల నుంచి ఐదేళ్లలోపు బాలబాలికలు ఆశ్రయం పొందుతున్నారన్నారు. వీరిని బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టి పిల్లలు లేని తల్లిదండ్రులకు న్యాయపరంగా దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. దత్తత కావాలనుకున్న వారు https://cara.wcd.gov.in, https://cara.wcd.nic.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దత్తత తీసుకోదల్చిన భార్యాభర్తలకు చెందిన ఆధార్‌కార్డులు, పాన్‌కార్డు, వారి వివాహ, జనన, ఆదాయ ధృవపత్రాలు, ఆరోగ్య ధృవీకరణపత్రం సమర్పించాలన్నారు. సింగిల్ పేరెంట్ అయితే విడాకుల డిక్రీ, మరణ ధృవపత్రం, బంధువుల ష్యూరిటీ, రూ.6వేలు డీడబ్ల్యూ, సీడబ్ల్యూ, ఈవోల పేరుపై డీడీ చెల్లించాలని కోరారు. ధృవపత్రాలను నరసరావుపేట పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో గల 133 ఇంటి నెంబరులోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం, ఐసీడీఎస్ పీడీ కె.ఉమారాణి, 63053 13833, జిల్లా బాలల పరిరక్షణ అధికారి డి.శౌరిరాజు, సెల్ 94918 93573, శిశుగృహ మేనేజర్ ఎం.కుమారి, సెల్.83090 48218, ప్రొటెక్షన్ అధికారి వై.ప్రశాంతకుమార్, సెల్.70953 02602లను సంప్రదించాలని కోరారు.

**పసికందు కోసం నెల రోజుల్లో సంప్రదించండి**

మాచర్ల మండలం నాగార్జునసాగర్ మేరీమాత చర్చి వద్ద ఈనెల 14న స్వాధీనం చేసుకున్న రోజుల పసికందు కోసం నెలరోజుల వ్యవధిలో తమను సంప్రదించాలని ఐసీడీఎస్ పీడీ కె.ఉమారాణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ పసికందును గుర్తుతెలియని వ్యక్తులు వదిలేయటంతో పోలీసుల ద్వారా ఐసీడీఎస్ అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ వైద్యశాలకు చేర్చామన్నారు. ఒక కన్ను మూసుకుపోవటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అనంతరం నరసరావుపేట బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే శిశుగృహాలో ఉంచామని చెప్పారు. ఆ పాపకు చెందిన తల్లిదండ్రులు, బంధువులు నెలరోజుల వ్యవధిలో సంప్రదించాలని కోరారు.

# కాంట్రాక్ట్ బిల్లుల అవకతవకలపై ఆడిట్

**నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):** గుంటూరు నగర పాలక సంస్థలో కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బిల్లుల్లో అవకతవకలు జరిగిన విషయంలో స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారులు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో బిల్లులు తనిఖీ చేశారు. జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు మరో ముగ్గురు అధికారులు వచ్చి బిల్లుల అకౌంటెంట్, ఎగ్జామినర్‌ను కలిశారు. గతంలో జరిగిన అవినీతి ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు/ఫైల్స్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విచారణకు ఎంత మంది సిబ్బంది అవసరమో వంటి, ఇతర వివరాలతో ప్రాథమిక దర్యాప్తు చేసి వెళ్లారు.

**అసలేం జరిగిందంటే..**

నగరపాలక సంస్థలో 2022లో అకౌంటెంట్‌గా పని చేసిన సిరిల్‌పాల్ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులను రూ.అరకోటి దాకా తన బినామీ ఖాతాలకు మళ్లించారనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేపట్టిన నగర కమిషనర్ కీర్తి చేకూరి అతడిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. పూర్తి విచారణ కోసం 3 నవంబర్ 2022న స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌కు కమిషనర్ లేఖ రాశారు. ఒక బృందాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టి ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో తేల్చి రిపోర్టు అందించాలని కోరారు. సస్పెండ్ అయిన సిరిల్‌పాల్‌పై ఇంతవరకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో నగరానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వానికి తగు ఆధారాలతో గత నెల 14న ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సిరిల్‌పాల్ చేసిన అవినీతిపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి ఎం.ప్రతాప్‌రెడ్డి సీడీఎంఏను (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఆదేశించింది. ఆనాడు కమిషనర్ కీర్తి చేకూరి రాసిన లేఖ, గత నెల ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా గురువారం స్టేట్ ఆడిట్ అధికారులు వచ్చినట్లు నగరపాలక సంస్థ కార్యాలయంలో చర్చ జరుగుతోంది.



నగరపాలక సంస్థ కార్యాలయం

# జీవితంపై విరక్తితో దివ్యాంగుడు బలవన్మరణం

ఉరివేసుకుని మృతి

**అద్దంకి:** జీవితంపై విరక్తితో ఓ దివ్యాంగుడు బ్రిడ్జి గ్రిల్స్‌కు తాడు కట్టి ఉరివేసుకుని మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని అద్దంకి – దర్శి రహదారిలోని గుండ్లకమ్మ వంతెనపై గురువారం వెలుగు చూసింది. అందిన సమాచారం మేరకు.. పట్టణంలోని పెరికపాలెంకు చెందిన నాగేశ్వరరావు ఉరఫ్ శేషు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి వినుకొండకు చెందిన మహిళతో వివాహం అయింది. భార్యా భర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో ఐదు సంవత్సరాల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం నాగేశ్వరరావు (50) లారీ యాక్సిడెంట్‌లో కాళ్లకు దెబ్బ తగిలి పనిచేయకుండా పోయాయి. దీంతో వంతెన సమీపంలోని ఓ డైరీలో రాత్రి సమయంలో పడుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వంతెన గ్రిల్స్‌కు లారీకి కట్టే తాడును బిగించి, ఆ తాడుతో మెడకు ఉరివేసుకుని కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గమనించారు. గుండ్లకమ్మ వంతెనపై స్టాండు, చెప్పులు, కూల్‌డ్రింక్ సీసా పడి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి తాడు విప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని చెల్లెలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అయితే వికలత్వాన్ని భరించలేక.. తనను ఆదరించే వారు లేకపోవడంతో బతుకుపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు.



మృతుడు నాగేశ్వరరావు

# ఎయిర్‌పోర్ట్ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

**విమానాశ్రయం(గన్నవరం):** విమానాశ్రయ విస్తరణకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారం దిశగా అధికారులు దృష్టి సారించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. స్థానిక ఎయిర్‌పోర్ట్ ట్రాన్సిట్ టెర్మినల్‌లో గురువారం విమానాశ్రయ విస్తరణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు చిన్నఅవుటపల్లి పరిధిలో ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ కింద కేటాయించిన ప్లాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విమానాశ్రయ విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు కౌలు పరిహారం బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసిత కుటుంబాలకు గృహ నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌అండ్ఆర్ స్థలంలో విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి మౌలిక సదుపాయలు కల్పించాలని పేర్కొన్నారు. విమానాశ్రయ విస్తరణ వల్ల రియల్ ఎస్టేట్ వెంచర్లలో ప్లాట్లు కోల్పోయిన యాజమానులకు అజ్జంపూడి పరిధిలో కేటాయించిన లేఅవుట్ అభివృద్ధికి ఏపీసీఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా నిర్మించిన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ ఏలూరు కాలువపై చేపట్టిన కొత్త వంతెన నిర్మాణానికి అవరోధాలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, గుడివాడ ఆర్డీఓ పద్మావతి, ఎయిర్‌పోర్ట్ డెరెక్టర్ ఎల్.లక్ష్మీకాంత్‌రెడ్డి, జనరల్ మేనేజర్ (సివిల్) కె.రామాచారి, తహసీల్దారు పవన్‌కుమార్, సీఆర్డీఏ తహసీల్దారు పాపాయమ్మ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీవేణుగోపాలస్వామికి లక్ష తులసి పూజ



ప్రత్యేక అలంకారంలో..

**నగరంపాలెం(గుంటూరు వెస్ట్):** కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం 10 గంటలకు లక్ష తులసి పూజ, రాత్రి 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జగన్నాథ, ఆంజనేయ, వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ (ఈఓ) డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు శ్రీఅయోధ్య అయ్యప్ప, భక్తులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 3.23 కోట్లు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రికార్డు స్థాయిలో కానుకలు, మొక్కుబడులు సమర్పించారు. వేసవి సెలవుల నేపథ్యంలో 16 రోజులకు రూ.3.23 కోట్ల మేర కానుకలు, మొక్కుబడుల ద్వారా ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు పర్యవేక్షణలో మహా మండపం ఆరో అంతస్తులో గురువారం కానుకల లెక్కింపు జరిగింది. రూ.3,23,75,523 నగదు లభమైంది. రోజుకు సరా సరిన రూ.20.23 లక్షల మేర ఆదాయం లభించిందని ఆలయ ఈఓ పేర్కొన్నారు. 694 గ్రాముల బంగారం, 6.264 కిలోల వెండితో పాటు విదేశీ భక్తులు డాలర్ల రూపంలో అమ్మవారికి కానుకలను సమర్పించారు. 516 యూఎస్ఏ డాలర్లు, 100 ఆస్ట్రేలియా డాలర్లు, వెయ్యి కొరియా ఒన్‌లు, 40 ఇంగ్లాండ్ పౌండ్లు, 100 ఓమన్ బైసాలు లభ్యమయ్యాయి. కానుకల లెక్కింపులో సేవా సిబ్బంది, ఆలయానికి చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు ఎస్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ B.Sc. డేటా సైన్స్; B.Sc. అగ్రికల్చర్; B.Sc. AI & ML; B.Sc బయో టెక్నాలజీ; BBA; B.VOC ... సంప్ర: 99125 67559, 77999 34688

**REAL ESTATE**

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ మార్కెటింగ్ కంపెనీకి గుంటూరులో మార్కెటింగ్ చేయుటకు అప్రూవ్/ నాన్ అప్రూవ్ వెంచర్ కావలెను. సంప్ర: 9080110144

**FLAT FOR SALE**

■ వర్ధిక నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్: 98481 10543, 70938 09070.

**HOUSE FOR SALE**

■ అమరావతి పట్టణము నందు 200 చ॥గ॥ లో 2016వ సం॥ ప్లాన్‌తో నిర్మించిన ఇల్లు అమ్మబడును. సంప్ర: 99598 38374

**TO-LET COMMERCIAL**

■ గుంటూరు హరిహరమహల్ సినిమా హాల్ వెనుక ఇండియన్ బ్యాంక్‌పైన 1st ఫ్లోర్ 3000 Sft కమర్షియల్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. Ph: 9848566343

**SERVICES**

**BUSINESS OFFER**

■ లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179

**GOLD FINANCE**

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 91699 22299

**WANTED**

■ బార్ & రెస్టారెంట్లో, కంప్యూటర్ ఆపరేటర్స్, లిక్కర్ బాయ్స్, కిచెన్ సూపర్‌వైజర్, వెయిటర్ P/T, F/T పనిచేయుటకు కావలెను. 8573271161, 8143198968

■ శ్రీ లక్ష్మీహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/ వంటపనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17000 రూం+ మీల్స్ ఫ్రీ. 8847148051

■ APSRTCలో ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహించుటకు టికెట్ కండక్టర్లుగా మరియు Ac Bus అటెండర్లుగా పని చేయుటకు స్టాఫ్ కావలెను. సంప్ర: 8639833430

■ ఒక ప్రముఖ రెసిడెన్షియల్ కాలేజి వారి మెస్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. కేవలం శాకాహార వంటలు మాత్రమే పనిచేయవలసిన ప్రదేశం: గుంటూరు. టిఫిన్ మాస్టర్ జీతం: 35,000/-, టిఫిన్ అసిస్టెంట్ జీతం: 20,000/-, గ్రైండర్ వేసే వాళ్లు (డే అండ్ నైట్ షిఫ్ట్) జీతం: 15,000/- కూరగాయలు కోసే వారు జీతం: 20,000/- భోజనం మరియు వసతి కల్పించబడును. మా దగ్గర చేరే వారు అందరు తప్పనిసరిగా అడ్రస్ ప్రూఫ్ చూపించవలెను. సంప్రదించగలరు. సెల్: 8978480435

■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు ఫిమేల్ హాస్టల్ ఇన్‌ఛార్జిలు మరియు వార్డెన్‌లు కావలెను. విద్యార్హత: ఇంటర్ లేదా డిగ్రీ, వయస్సు: 21+ ఉండవలెను. జీతం: 12000/- పరిత పనిచేయు స్థలం: గుంటూరు. సంప్ర: 9248733329

■ గుంటూరులో ప్రముఖ నర్సింగ్ కాలేజి నందు పనిచేయుటకు డిగ్రీ చదివిన లేడి వార్డెన్స్ మరియు వాచ్‌మెన్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 8122461164

■ భారతపేట గుంటూరు రోజు 3 లేదా 6గం॥ క్రైస్తవ విజ్ఞాపన చేయగల స్త్రీ/పు లోకల్ వారు కావలెను. నెలకు 3/7వేలు కానుక కలదు. క్రైస్తవ పెళ్లి సంబంధాల కొరకు సంప్ర: 7989721270

■ గుంటూరులో ప్రముఖ కంపెనీలో Imported High-end కార్స్ నడుపుటకు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి అనుభవం ఉన్న డ్రైవర్స్ కావలెను. అనుభవం బట్టి జీతం: 9866543339

■ మెడికల్ షాపులో పనిచేయుటకు కంప్యూటర్ బిల్లింగ్ అనుభవం కలిగిన ఫార్మాసిస్టు & నర్సింగ్ స్టాఫ్ కావలెను. మంచి జీతం. ఆసక్తి కలవారు రామన్నపేట 1/4 ప్రభావతిగారి హాస్పిటల్ నందు సంప్రదించగలరు. 9849230580

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15–20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్: 85026 15217

■ డ్వాక్రామహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీరే పెట్టుకొనకొవ్వొత్తులు, పెన్సిల్స్ తయారుచేసి మాకు ఇవ్వండి. గ్రూపులకు ఉచిత శిక్షణ. 9491995565

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ.18K. ఫోన్: 9640258899/9640468899

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167541 7075167663

గమనిక: సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.